
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 | కనిష్ఠం 22.3
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 5 జూలై 2024



జాతీయ స్థాయి హాకీ పోటీలకు శ్రావ్య ఎంపిక

కామారెడ్డి టౌన్, జూలై 4: మాచారెడ్డి మండలంలోని ఫరీద్‌పేట్‌కు చెందిన తగిరంచ శ్రావ్య జాతీయ స్థాయి జూనియర్ సౌత్ జోన్ హాకీ పోటీలకు ఎంపికైందని హాకీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ చదువుతున్న శ్రావ్య ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో నిర్వహించిన జూనియర్ మెన్ అండ్ ఉమెన్ సౌత్ జోన్ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల 10 నుంచి 17 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది.



కౌలు రైతుకు.. గుర్తింపేది?

కామారెడ్డి టౌన్, జూలై 4: సొంత భూములు లేక కౌలు పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను ఏళ్ల తరబడి ప్రభుత్వాలు గుర్తించడం లేదు. పంటసాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం నుంచి సాకారం అందక, పండించిన పంట అధికారికంగా అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో వందల ఎకరాలు కలిగిన భూస్వాములు కనీసం సాగు వైపు కన్నెత్తి చూడకపోయినా రైతుబంధు అందుతూ వచ్చింది. కానీ ఆ భూమిని నమ్ముకుని కష్టపడి పనిచేసే కౌలురైతుకు ఎక్కడా సహాయం అందలేదు. దీంతో ఎందరో కౌలు రైతులు పంటచేతికి వచ్చినా రాకున్నా కౌలు మాత్రం కడుతూ వచ్చారు. పండిన పంటలను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడ్డారు. పైగా వ్యవసాయమే తప్ప ఇతర పని చేయలేని కౌలు రైతులంతా ఏడాదంతా కష్టపడి పండించిన పంటను అమ్మి అధిక శాతం వడ్డీకి తీసుకున్న ప్రైవేట్ అప్పులే తీరుస్తున్నవారు అనేకం ఉన్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో కౌలు రైతులకు సైతం రైతు భరోసాను అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుతం వానాకాలం సాగు పనులు జోరుగా సాగుతుండగా ఇంత వరకు కౌలు రైతులకు అందే సహాయంపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఇంకా ఎప్పుడు తమకు పంటపెట్టుబడి సాయం అందుతుందో అని ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 30 వేలకు పైగా కౌలు రైతులు

జిల్లాలో 30వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్ర రంగాలకు చెందిన వారు వ్యవసాయం చేసే ఆసక్తి లేకపోవడంతో పాటు సాగు కష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు లేక తమ భూములను కౌలుకు ఇచ్చేస్తుంటారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు విడతలుగా అందించిన రైతుబంధు పంట సహాయం పట్టాదారు రైతుల ఖాతాల్లోనే జమ అవుతూ వచ్చింది. దీంతో పంటను సాగు చేసిన కౌలురైతు పేరే ఎక్కడ లేకుండా పోయింది. గత ప్రభుత్వం అందించిన రైతుబంధులో కౌలు రైతు ఊసే లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పంటలు సాగుచేసి ఎరువులు, కలుపులు తీయాల్సిన పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించారు. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. బ్యాంకులు కూడా కౌలు రైతులకు రుణం ఇవ్వడం లేదు. గతంలో కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసేవారు. కొంతకాలంగా భూములన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ధరణి పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను ఉంచింది. కొత్తగా జారీ చేసిన డిజిటల్ పాసు పుస్తకాల్లో పట్టాదారు పేరు మినహా ఇతర కాలం ఎక్కడ లేదు. దీంతో కౌలు రైతుల గుర్తింపునకు శాశ్వతంగా అడ్డుకట్టపడింది.

పెరుగుతున్న పెట్టుబడులు

రోజురోజుకూ పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఒక ఎకరంలో పత్తి పంట వేయాలంటే రూ25వేలు, వరి పొలానికి రూ.30వేలు, మొక్కజొన్న చేనుకు రూ.25వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కౌలు డబ్బులు కాకుండా రైతు కుటుంబీకుల కష్టం పోను విత్తనాలు, ఎరువులకే అధిక పెట్టుబడి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత కష్టపడినప్పటికీ ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15వేలు కూడా మిగిలే పరిస్థితి లేదు. 2018 నుంచి రైతుబంధు అమలు చేయగా అప్పటి నుంచి కౌలు రైతులు తమకు ఏదో ఒక రూపంలో సాయం చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చింది. కౌలు రైతులను గుర్తించి అర్హత కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు అందేలా చూడాలని కోరారు. అయినా ఎలాంటి స్పందన లేకపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతుభరోసా కింద రూ.15వేలను అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో కొంతమేర కౌలు రైతుల్లో ఆనందం వ్యక్తం అయి నప్పటికీ ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు తడిసి మోపేడు అవుతుండడంతో ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం ఎంతో కొంత తమకు ఆర్థిక తోడ్పాటును అందించే విధంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

- ఏళ్ల తరబడి పట్టించుకోని ప్రభుత్వాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తామని హామీ
- ఇంకా అటువైపుగా అడుగులు పడని వైనం
- పంట చేతికి వచ్చినా.. రాకున్నా కౌలు కట్టాల్సిందే..
- పండిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు
- ప్రతీ సీజన్‌లో ఎరువుల కోసం తిప్పలు
- రుణాలు లేక ప్రైవేట్‌గా అప్పులు

అమ్ముకోవడానికి సైతం తిప్పలు

కౌలు తీసుకున్న భూమిలో ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన కౌలు రైతులకు పంట అమ్ముకోవడానికి తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంట సాగు చేస్తున్నాడు అనే వివరాలను వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. అధికారులు సైతం పట్టాపాసు పుస్తకం కలిగిన రైతుల వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేస్తున్నారు. తమకు ప్రభుత్వసాయం ఎక్కడ రాదో అనే భయంతో పంట సాగు చేయకుండా పట్టాపాసు పుస్తకం ఉన్న భూ యజమానాలు సైతం కౌలు రైతు పంటను తమపేరున నమోదు చేయించుకుంటున్నారు. వివరాలు అన్ని భూ యజమాని పేరు మీదుగా నమోదై ఉండడంతో కౌలు రైతు పంట విక్రయించే సమయానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కౌలు రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలు, సీసీఐ కేంద్రాల వద్ద విక్రయించేప్పుడు భూ యజమాని వివరాలు ముందస్తుగా ఉండడంతో వారి ఖాతాలోకి పంట విక్రయానికి సంబంధించిన సొమ్ము జమ అవుతోంది. తిరిగి వారి ఖాతాలో నుంచి తీసుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం జరిగినా పరిహారం సైతం కౌలుకు ఇచ్చిన భూ యజమానికే వర్తిస్తుందని కౌలు రైతులు చెబుతున్నారు.

ఆశల పల్లకిలో.. ఆశావహులు

- స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురుచూపు
- ముగిసిన సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం
- తమకే పదవులు వరిస్తాయని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న వైనం
- ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం

భిక్కనూరు, జూలై 4: అన్నీ కలిసివస్తే సర్పంచ్ గానో, ఎంపీటీసీ గానో, చివరికి వార్డు సభ్యుడి గానో పోటీ చేసేందుకు కలలు కంటున్న ఆశావహులకు నిరాశే మిగులనుంది. ఇది వరకే సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా ఈ నెల 3న జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగిసింది. పార్లమెంట్ ఎన్నికలు కాగానే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీకి కలిపి ఎన్నికలు జరుగుతాయని గంపెడాశతో ఉన్న ఆశావహుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థానిక సంస్థల ఎన్నికలను ఈ ఏడాది చివరిలో నిర్వహించిందేకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. దీనిలో భాగంగానే గత జనవరిలో సర్పంచ్‌ల పదవికాలం ముగియగానే గ్రామాలకు ప్రభుత్వం వారి స్థానాల్లో ప్రత్యేక అధికారులను నియమించగా, ఇదే తరహాలో ఇప్పుడు జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియగానే మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో సంవత్సర కాలం నుంచి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పోటీ చేయాలన్నా ఉద్దేశ్యంతో గ్రామాల్లో చాలా మంది ఆశావహులు గ్రామాల్లో ఎక్కువగా ప్రజలతో మమేకం కావడంతో పాటుగా యువకులకు, పెద్దలకు సమయం వచ్చినప్పుడల్లా పార్టీలు ఇవ్వడం, సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం లాంటి చేస్తూ ఎవరికి తోచిన విధంగా వారు ఖర్చు చేస్తూ ప్రజల్లో పతారా పెంచుకోవడానికి నానా కష్టాలు పడుతున్న ఆశావహులు తలలు బాదుకుంటున్నారు. ఎన్నికల కోసం దాచుకున్న డబ్బులు ఇప్పుడే ఖర్చు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ఇక నామినేటెడ్ పోస్టుల విషయానికొస్తే ఆ పదవులను ఆశిస్తున్న వారు జిల్లా వ్యాప్తంగా చాలా మందే క్యూలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే నామినేటెడ్ పోస్టుల కోసం ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీతో పాటుగా ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతరావుల చుట్టూ ఆయా నియోజక వర్గంలోని నాయకులు కాళ్లు అరిగేలా చక్కర్లు కొడుతున్నారు. కష్ట సమయంలో పార్టీతో ఉండి పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పోస్టులు ఇస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు చెబుతున్నప్పటికీ చాలా మంది బీఆర్ఎస్ నుంచి ఆ నామినేటెడ్ పోస్టులకు ఆశపడి కాంగ్రెస్‌లో చేరిన వారు సైతం చాలానే ఉన్నారు. అసలు ఈ నామినేటెడ్ పోస్టులు ఎవరిని వరిస్తాయో, అదృష్టవంతులు ఎవరో వేచి చూడాలి.

నామినేటెడ్ పోస్టులు.. స్థానిక సంస్థలపైనా చాలా మంది ఆశలు

రాష్ట్రస్థాయిలో ఎన్నో గుర్తింపు ఉన్న అనేక కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో పాటుగా జిల్లాలోని గ్రంథాలయ సంస్థ చైర్మన్, సీడీసీ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులతో పాటుగా విండో చైర్మన్లు, డైరెక్టర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల పదవులపై చాలా మంది నాయకులు ఆశ పడుతున్నారు. ఇప్పటికే వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తమకే పలానా పదవి దక్కబోతుందని, తమ నాయకుడికే దక్కుతుందని చాలా మంది పోస్టులు, స్టేటస్‌లు పెడుతున్న పరిస్థితి ఉంది.

ఈ పదవులు ఎవరికి కలిసొచ్చేనో?

గత పది సంవత్సరాలుగా ఎలాంటి పోస్టులు లేకుండా అధికారపక్ష నాయకులు పెట్టిన ఇబ్బందులను భరించి కాంగ్రెస్‌నే నమ్ముకుని ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్‌లోనే ఉన్న నాయకులు తమకే ఈ పోస్టులు వస్తాయని ఎంతో గంపెడు ఆశతో ఉన్న వారికి ప్రస్తుతం ఇతర పార్టీల నుంచి పార్టీలోకి వచ్చిన వారితో కొత్త తలనొప్పి వచ్చి చేరింది. గ్రామాల్లో ఎప్పటి నుంచో తన క్యాడర్‌ను కాపాడుకుంటూ వారికి ఎల్లవేళలా అండగా ఉన్న తమకే ఈ పదవులను ఇవ్వాలని, ఇప్పుడిప్పుడే పదవులను ఆశించి ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎలాంటి పదవులను ఇవ్వొద్దని కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు ప్రభుత్వ సలహాదారుడు, జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేల వద్ద వారి గోడును వెళ్లబోసుకుంటున్నారు. పార్టీని నమ్ముకుని ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని ఎదుర్కొని తమ నాయకుడి వెంటనే ఉన్న తమకే ఈ పదవులు వస్తాయని కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేసిన నాయకులు, కాదు కాదు తమకు పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తేనే ఈ పార్టీలో చేరామని తమకు ఈ పదవులు వస్తాయని కొత్తగా ఇతర పార్టీల నుంచి చేరిన వారు ఇలా ఎవరికి వారే ఆశల పల్లకిలో తేలియాడుతున్నారు.

కొత్తగా చేరిన వారితో ప్రజల్లో వ్యతిరేకత

గతంలో నమ్మిన పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా నాయకులు, కార్యకర్తలు ఒకే పార్టీలో ఉండేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి ఎమ్మెల్యేల నుంచి మొదలుకొంటే సామాన్య కార్యకర్తల వరకు సునాయాసంగా చేరిపోతున్నారు. ఇందులో పదవులను ఆశించి కొందరు చేరితే, మండలం నుంచి జిల్లా రాష్ట్ర స్థాయిలో అధికార పార్టీలో ఉంటే ఎలాంటి పనులైనా చిటికెలో చేయించుకోవచ్చునని మరికొందరు చేరిపోతున్నారు. గత 10 సంవత్సరాలుగా పార్టీని, పార్టీ నాయకులను ఇష్టం వచ్చినట్లు తిట్టి, కార్యకర్తలను నానా ఇబ్బందులు పెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవేమీ పట్టనట్లుగా పార్టీలో ఎలా చేరుతారని, కాంగ్రెస్ అధిష్ఠానం సైతం ఎలా చేర్చుకుంటుందని ప్రజలు వాట్సప్ గ్రూప్‌లలో పోస్టు పెడుతున్నారు. ఈ అంశాలపై పెద్దఎత్తున వాట్సప్, ఇతర వాటిల్లో చర్చలు పెడుతున్నారు. దీనిని బట్టీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకుల పట్ల ప్రస్తుతం ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

పల్లెల్లో గట్టు పంచాయితీలు

- పెండింగ్‌లో భూమి కొలతలు
- ఇబ్బంది పడుతున్న భూ యజమానులు
- భూమి ధరలు పెరగడమే కారణం

ఎల్లారెడ్డి, జూలై 4: గ్రామాల్లో సర్వేయర్లు భూముల కొలతలు సమయానికి కొలవకపోవడంతో గట్టు పంచాయితీలు ఎక్కువయ్యాయి. భూమి కొలతల కోసం రైతులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల సర్వేయర్లు 45 రోజుల లోపు భూమి కొలతలు చేపట్టాలి. కానీ చాలా గ్రామాల్లో సర్వేయర్లు సమయానికి సర్వే చేయకలేకపోవడంతో భూముల వద్ద గట్టు పంచాయితీలు నడుస్తున్నాయి. ఓ రైతు భూమి సర్వే కోసం జిల్లా సర్వేయర్ వద్ద ఫిబ్రవరి నెలలో డీడీ తీసి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు కొలవలేదు. శాశ్వత సర్వేలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు, మూడు ఏళ్లుగా ఇన్‌చార్జి సర్వేయర్లు కొనసాగుతుండటంతో కొలతలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని 22 మండలాలు 526 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 5,14,290 ఎకరాల వ్యవసాయ భూమి 3,16,650 రైతులు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ఇక్కడ భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో ఎకరం భూమి రూ.30 నుంచి 80 లక్షల వరకు పలుకుతోంది.

ఇన్‌చార్జి సర్వేయర్లతో ఇబ్బందులు

మండల సర్వేయర్లు వారి మండలాలకు విధులు నిర్వహిస్తూ అదనంగా పక్క మండలాల అదనపు బాధ్యతలు కూడా అప్పగిస్తున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్లతో రైతులు భూ కొలతలు కాక ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది రైతులు ప్రైవేట్ సర్వేయర్‌తో వేల రూపాయలు ఖర్చు పెట్టి కొలతలు చేసుకుంటున్నారు. ఒక్కో రైతు మీసేవలో చాలా సార్లు దరఖాస్తు చేసుకున్న భూమి కొలిచే నాథుడు లేకపోవడంతో గట్టు పంచాయితీలు పెరుగుతున్నాయి. గుంట అరగుంట కోసం రైతులు గొడవలు పెట్టుకుంటున్నారు.

పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్న రైతులు

సర్వేయర్ లేకపోవడంతో రైతుల మధ్య గొడవలు పెరిగి పోలీసు స్టేషన్ వరకు చేరుతున్నాయి. దీంతో భూముల పంచాయితీ పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కోసారి రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు ఉండటంతో పాటు కొలతలు అప్పగిస్తుండటంతో వారికి పని భారం ఎక్కువైంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మండలాలకు శాశ్వత సర్వేయర్లను నియమించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

- సాయిలు, రైతు

శాశ్వత సర్వేయర్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఒక్కో సర్వేయర్‌కు రెండు మండలాల బాధ్యతలు ఉండటంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శాశ్వత సర్వేయర్లను నియమించి రైతుల సమస్యలు తీర్చాలి.

ఐదేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం

- జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

కామారెడ్డి టౌన్, జూలై 4: ఐదేళ్లలో జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని జడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. గురువారంతో జడ్పీ పాలకవర్గ సభ్యుల పదవి కాలం ముగుస్తుండడంతో జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల పాత్ర గ్రామాల అభివృద్ధిలో కీలకమైందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో స్థానిక సంస్థల ప్రతినిధులు సఫలీకృతం అయ్యారని తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో తమకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తమ వంతు కృషి ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. జడ్పీటీసీలు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సామరస్యంగా ప్రతీ సమావేశం జరిగే విధంగా తోడ్పాటును అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారీతిన వ్యవహరిస్తే చర్యలు తప్పవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, జూలై 4: జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన 'ప్రైవేట్ దోపిడీ' అనే కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 122 ప్రైవేట్ ఆసుపత్రులు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ ద్వారా అనుమతులు తీసుకున్నారని తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు ఇప్పటికే పలు సూచనలు చేశామని తెలిపారు. ప్రిస్క్రిప్షన్, నేమ్ బోర్డులో ఎవరైన డాక్టర్ అని రాసుకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ ఆర్ఎంపీ, పీఎంపీలు బలవంత పెడుతూ వారు చెప్పిన ఆసుపత్రులకు రోగులను పంపించేలా బలవంతం చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ ఆసుపత్రిలో రిసెప్షన్ వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేసి అదే మాదిరి వసూళ్లు చేయాలని తెలిపారు. ఎవరైన ఆసుపత్రులలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తే జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



పోచారం ప్రాజెక్టు పరిసరాలను పరిశీలిస్తున్న ఈకో టూరిజం ఐఎఫ్ఎస్ అధికారి రంజిత్ నాయక్

పర్యాటకరంగ అభివృద్ధి కోసమే
పోచారం ప్రాజెక్టు పరిశీలన

నాగిరెడ్డిపేట, జూలై 4: పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభి వృద్ధి చేసేందుకు గాను గురువారం రాష్ట్ర ఈకో టూరిజం విభాగంకు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి రంజిత్ నాయక్ ప్రాజెక్టును పరిశీలించారు. గతంలో పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు రాష్ట్ర ఈకో టూరిజం ఐఎఫ్ఎస్ అధికారి రంజిత్ నాయక్ కామారెడ్డి జిల్లా నీటి పారుదల శాఖ ఎస్ఈ విద్యావతి, మెదక్ జిల్లా ఫారెస్టు అధికారి రవి ప్రసాద్‌లతో కలిసి ప్రాజెక్టును, ప్రాజెక్టు పరిసరాలను, ప్రాజెక్టు వద్ద ఉన్న అతిథి గృహాలను ఆయన పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, ప్రాజెక్టు పక్కనే ఉన్న అభయారణ్యం, వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రం తదితర వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు మధ్యలో ఉన్న ఐలాండ్ స్థలం గురించిన ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసే అవకాశాల గురించి ఆయన వివరాలు తెలుసుకున్నారు. అధికారులు వెంట ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

నందిపేటలో మెయిన్‌రోడ్డు పనులు షురూ


నందిపేటలో రోలర్‌తో నడుస్తున్న పనులు

నందిపేట, జూలై4: నందిపేట మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మెయిన్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వివేకానంద చౌరస్తా నుంచి ఎన్మాట్ ఐలమ్మచౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా మీదుగా నంది విగ్రహం వరకు ఫోర్‌లైన్ రోడ్డు పనులు చేపట్టారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో రోడ్డు పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. దీంతో చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఇటీవల ఆంధ్రజ్యోతి మెయిన్‌లో రోడ్డు ఇలా ప్రయాణం ఏలా అనే శీర్షికన వార్త కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా స్థాయి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌లు రోడ్డు పనులను ముమ్మరం చేశారు. గుంతలలో ఉన్న మట్టిని తొలగించి కాంక్రిట్ వేస్తున్నారు. రోడ్డు రోలర్‌తో తొక్కిస్తూ బ్లైడ్ ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను మళ్లీ ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి'

డిచ్‌పల్లి,జులై 4: గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సందర్భంగా డిచ్‌పల్లి, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళా శాలలు, పాఠశాలలు పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు మూసీ వేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. నీట్, పరీక్షల అవకతవకలపై న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకర్,తేజా, గణేశ్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం

పెర్కిట్, జూలై4: నీట్, యుజీ 2024ఎంట్రెన్స్ పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం క్షమపణ చెప్పాలని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని పలు పాఠశాలలో విద్యార్థులను సమావేశం పరిచి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నరేందర్, దుర్గాప్రసాద్, నిఖిల్, సిద్ధు, వసంత, అర్వింద్, రాములు, లక్ష్మణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

ఏర్గట్ల, జులై 4:నీట్ పరీక్ష విషయంలో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న వ్యక్తులను ఎంతటి వారైనా పట్టుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మం డలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు.

నీట్ విద్యార్థులకు మద్దతుగా బంద్ సక్సెస్

మోస్రా,జులై4: ఎస్ఎఫ్ఐ మోస్రా మండల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అల్తామాష్ మాట్లాడుతూ నీట్ విద్యార్థులకు మద్దతుగా దేశవ్యాప్త బంద్ కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడుస్తున్న ఎన్‌టీఏ బోర్డ్‌ను వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి 24లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రధాని మోడీ కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ మూసుకున్న నోరు తెరిచి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అదే విధంగా కేంద్రం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడి నీట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహించాలని అన్నారు. అదే విధంగా కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరించి రీ పరీక్షనునిర్వహించాలని కోరారు. అదే విధంగా తప్పు చేసిన కోచింగ్ సెంటర్లపై శాశ్వతంగా నిషేధించాలని అన్నారు. బాధిత నీట్ విద్యార్థులకు న్యాయం చేయకపోతే అడుగు అడుగునా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకుంటామని అన్నారు. అదే విధంగా యుజీసీ నెట్ విద్యార్థుల పరీక్షను సరిగ్గా నిర్వహించని ఎన్‌టీఏ బోర్డ్‌ను ప్రక్షాళన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీషాన్, అనిల్, మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో బంద్ విజయవంతం

ముప్కాల్, జూలై4 : నీట్ పరీక్షల రద్దు చేయాలంటూ ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఎన్‌టీఏ బోర్డును రద్దు చేయాలని దేశవ్యాప్తంగా విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఏరియా కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ నెలరోజులుగా నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలుగా ఉద్యమాలు చేపడుతున్న కేంద్ర మంత్రులు ఇప్పటి వరకూ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను నడిరోడ్డుపై పడేసే విధంగా అక్రమంగా పేపర్ లీకేజీ చేయడం ప్రధాని దానిపై మౌనంగా ఉండడం సబబుకాదన్నారు. విద్యార్థి సంఘాలను అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు అత్యుత్సాహం చూపించారన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు సిద్ధూరాం, లక్ష్మణ్, జంపన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన బీర్కూర్ విద్యార్థి

బీర్కూర్, జూలై 4 : బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విఘ్నేష్ పదోతరగతి చదువుకుని ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణుడు అయ్యాడు. పదోతరగతి ఫలితాల్లో పదికి పదికి గ్రేడ్ పాయింట్లు సాధించాడు. అనంతరం ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకున్నాడు. బాసర ట్రిపుల్ ఐటీకి విఘ్నేష్ ఎంపికయ్యాడు.

బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డి పేట ప్రత్యేక అధికారి

నాగిరెడ్డిపేట, జూలై 4 : మండల పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం బుధవారం నాటితో ముగియడంతో మండల పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. దీనిలో భాగంగా నాగిరెడ్డిపేట మండల పరిషత్‌కు మండలంలోని మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఏడీఏ వీరస్వామిని ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో పర్బన్న, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి అమానుషం

తవర్ని, జూలై4: నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దాడిని, విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరును సీపీఎం పార్టీ వర్ని ఏరియా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. ప్రధాని మోడీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసిన అక్రమార్కులను అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను ఒంటిమీద బట్టలు చిరిగేలా ఈడ్చుకుంటూ అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. వెంటనే అరెస్టు చేసిన విద్యార్థి సంఘ నాయకులను బేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ట్రిబుల్ ఐటీకి మోడల్ విద్యార్థుల ఎంపిక

రెంజల్,జులై4: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అక్షిత, కరీమా బేగంలు బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. గురువారం మోడల్ పాఠశాలలో ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను శాలువ, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ఉన్నత వద్యకై బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నప్ప, శ్రీనివాస్, ప్రవీణ్, స్వూప్న తదితరులున్నారు.

ముప్కాల్ విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, జూలై4: పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీకీ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం తెలిపారు. ముప్కాల్ పాఠశాలలో విద్యార్థులు సీహెచ్.రచన, ప్రశాంత్, పి.కార్తికేయ, ఎ.వైశాలి, ఎం.రచన, అక్షయ, బి.అభినయ, ఎస్.వైశాలిలు ట్రిబుల్ ఐటికి ఎంపిక కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

ఆర్మూర్‌టౌన్, జూలై4: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దొడ్డికొమురయ్య రజాకార్ల, భూస్వాముల ఆగడాలను కాల్చి బుడిద చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రారంభించారని, పేదలకు భూములు పంచాలని రజాకార్లకు వ్యతిరేకంగా వెట్టిచాకిరి నిర్మూలించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, రవి, సుజాత, కుల్‌దీప్ శర్మ, చింటు, శ్రావణ్, బంటి, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రెటరీ సభ్యులు వి.ప్రభాకర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం చేసిన అయన నేటి కమ్యూనిస్టు విప్లవకారుడు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, సహయకార్యదర్శి రమేష్, నాయకులు ముత్తెన్న, సురేష్, సత్తెక్క, కిసాన్, రాజేశ్వర్, అశోక్, బాబాన్న, దామోదర్, ఎం.నరేందర్, నిఖిల్, అషిష్, అర్వింద్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో ..

భిక్కనూరు, జూలై 04: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలం లోని అయాగ్రామాల్లో వీర తెలంగాణ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. భిక్కనూరు మండలకేంద్రంలో కుర్మ యువచైతన్య సమితి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి నిఖిల్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం అతిచిన్న వయస్సులో నిజాం, రజకారులకు, దేశముఖ్‌లకు పోరాడిన యోదుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం ప్రతినిధులు మల్లేషం, బీరయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

భిక్కనూరు, జూలై 04: నీట్ పరిక్షలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమం గురువారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఆశోక్, బీవీఎం మండల అధ్యక్షుడు గోసు రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి మూసివేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసమర్ధంగా పరిక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, గత పదేళ్లలో 70పరిక్ష పేపర్లు లీక్‌అయ్యాయని ఆరోపించారు. వెంటనే వీటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'పది ఎకరాల లోపు వారికే రైతు బంధు అమలు చేయాలి'

బోధన్‌రూరల్, జూలై 4 : పది ఎకరాల లోపు వారికే రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని, బీడు భూములకు, గుట్టలకు రైతుబంధు పథకాలు ఇవ్వవద్దని రైతులు స్పష్టం చేశారు. గురువారం బోధన్ మండలంలోని అమ్దాపూర్, జాడి తదితర సహకార సంఘాల్లో రైతుబంధు పథకం అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు వర్తింపజేయవద్దన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ 500 రూపాయలు చెల్లించాలన్నారు. భార్యభర్తలు ఇద్దరు కలిపి 5ఎకరాల లోపు ఉన్న వారికే రైతుబంధు అందించాలన్నారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రైతుబంధుపై వాస్తవాలు వివరించే ముందు రైతుల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంపై అన్ని కోణాల్లో కసరత్తు చేసి రైతుబంధు అమలుకు రూపకల్పన చేస్తుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : పది ఎకరాల లోపు రైతులకే రైతుబంధు పథకాన్ని అమలు చేయ్యాలని, బీడు భూములకు, గుట్టలకు, రోడ్లకు, కాలువలకు, ప్లాట్లు చేసిన భూములకు, బడా వ్యాపారులకు రైతుబంధు పథకాలు ఇవ్వవద్దని రైతులు స్పష్టం చేశారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంతో పాటు జైతాపూర్, జానకంపేట తదితర సహకార సంఘాల్లో రైతుబంధు పథకం అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు వర్తింపజేయవద్దన్నారు. పిల్లల పై చదువులకోసం లోను తీసుకుని ఐటీ కడుతున్న రైతులకు రైతుబంధు ఇవ్వాలన్నారు. రేషన్‌కార్డు ప్రాతిపదికన కాకుండా పట్టా బుక్కు ప్రాతిపదికన రైతుబంధు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ 500రూపాయలు చెల్లించాలన్నారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రైతుబంధుపై వాస్తవాలు వివరించే ముందు రైతుల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంపై అన్ని కోణాల్లో కసరత్తు చేసి రైతుబంధు అమలుకు రూపకల్పన చేస్తుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, నారాయణ, మిద్దె నరేంధర్, సొసైటీ డైరెక్టర్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం అమలుపై రైతుల సలహాలు, సూచనల కార్యక్రమాన్ని గురువారం రెంజల్, దూపల్లి, నీలా ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక మహాసభలను ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నూతన విధానంలో రైతులకు రైతుబంధును అందించాలన్న సంకల్పంతో రైతులు వారి అభిప్రాయాలను తెలియాలని రైతులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్లు మొయినోద్దీన్, భూమారెడ్డి, ఇమామ్ బేగ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక కోసం రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తెలియజేసిన సలహాలు, సూచనల మేరకు రైతుబంధుపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవోలు రాము, జీవన్ రెడ్డి, రాందాస్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కృష్ణవేణి, అజయ్, గోపికృష్ణ, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

నవీపేట, జూలై4: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ సామ్రాట్‌యాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో డెంగ్యూ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. దోమల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కిషన్, వెంకటేశ్వర్ రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

నవీపేట, జూలై 4 : ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నియంత్రణ అధికారి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీబీ నియంత్రణకు పైలెట్ ప్రాజెక్టుగా 17 జిల్లాలను ఎంపిక చేసిందని, ఇందులో నిజామాబాద్ జిల్లా కూడా ఉందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర్ రావు, కిషన్, సిబ్బంది రాణి, పుష్ప, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

ప్రజలకు సేవ చేయడమే భాగ్యం

● వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

ఏర్గట్ల, జూలై 4: ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవ చేయడమే మహాభాగ్యమని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఐదేండ్ల పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించడం, ప్రజాసమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అశ్రఫ్, ఎంపీటీసీలు బొల్లి శంకర్, ఆడెపు సవిత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో అబ్దుల్‌మాలిక్, ఏఈవో ఆంధ్రయ్య, ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బీపీ, షుగర్ ఉన్న వారికి ట్రీట్‌మెంట్ తప్పనిసరి'

వేల్పూర్, జూలై4: గ్రామాలలో బీపీ, షుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్‌లు వెంకటేశ్వర్, సురేష్‌లు సూచించారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో భీమ్‌గల్, ముచ్కూర్, వేల్పూర్ పీహెచ్‌సీలకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీ, ఎఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో బీపీ, షుగర్ కేసులు వారందరికీ ఎన్‌సీడీ పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజలందరికీ ఏబీహెచ్ఏ కార్డు క్రియేట్ చేయాలని, అందుకు గ్రామాల ప్రజలందరూ సహకారం ద్వారా వారి ఆధార్‌కార్డును ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భీమ్‌గల్, వేల్పూర్, ముచ్కూర్ పీహెచ్‌సీలు సూపర్‌వైజర్‌లు శంకర్, నాగమణి, భూలక్ష్మీ, బాబురావు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

బోధన్‌రూరల్, జూలై4 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్యను నేర్పించడమే లక్ష్యంగా నూతన విద్యావిధానంపై టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం బోధన్ ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జానకి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి రోజులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యావిధానంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీచైర్మన్‌కు సన్మానం

ఎడపల్లి, జూలై 04: జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావును గురువారం కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదన్న గారి విఠల్ రావు కరోనా సమయంలో చేసిన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళ్ సభ్యులు శేఖర్ రాజు, తెలంగాణ శంకర్, శేఖర్ రెడ్డి, నీలం రెడ్డి, పృథ్వీ రాజు తదితరులున్నారు.

'ఎరువుల కొరత లేకుండా చూడండి'

ఆర్మూర్‌టౌన్, జూలై4: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు గురువారం రైతాంగ సమస్యలపై ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైన యూరియా, ఫర్టిలైజర్ కొరత ఉందని, జిల్లాలో కొరత లేకుండా చూడాలని తెలిపారు. రైతులకు కరెంటు సమస్య ఏర్పడుతుందని, లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఏసీపీకి వినతి

ఆర్మూర్‌టౌన్, జూలై4: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన పలువురు గురువారం ఏసీపీ బస్వారెడ్డికి వినతిపత్రం అందజేశారు. డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన కత్తురి రాజమణి, నవనీత, గంగామణిలను అదే గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ కెనాల్‌కు సంబంధించిన భూమిలో పశువుల పెంటను నిల్వ చేయనిస్తాలేరని, వేరే కులానికి చెందిన వారు పశువుల పెంటను నిల్వ చేసుకుంటున్నారని తమపై కక్షగట్టి అసభ్య పదజాలంతో దూషిస్తూ చంపివేస్తామని బెదిరిస్తున్నారని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని నందిపేట ఎస్సై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలేదని, తమకు ప్రాణ భయం ఉందని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నందిపేట, జూలై4: మండలంలోని ఆంధ్రానగర్ గ్రామశివారులో ఉన్న పేకాట స్థావరంపై సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.24 వేల 420 నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతేగాకుండా ఏడుసెల్‌ఫోన్‌లను సీజ్‌చేశారు. ఏడుగురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకొని తదుపరి చర్యల నిమిత్తం నందిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, సిబ్బంది గజేందర్, అనిల్, నర్సయ్య, తదితరులున్నారు.

లెదర్‌పార్క్ స్థలాన్ని కాపాడాలని కలెక్టరకు వినతి

ఆర్మూర్‌టౌన్, జూలై 4 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాదిగ సంఘాల యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు లెదర్ పార్క్ స్థలాన్ని కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 401/66 సర్వే నెంబర్‌లో 28ఎకరాల స్థలాన్ని లెదర్ పార్క్ కోసం కేటాయించారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు గోడను కూల్చి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాని ఆయన కోరారు. ఆయన వెంట పి.వెంకటేష్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేస్తున్న కొక్కెర భూమన్న

కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది

● హామీలు పూర్తిగా మరిచారు ● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, జూలై4: ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిసారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో గత పదేళ్ళలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందని, చేసిన అభివృద్ధిని ప్రజలు ఎన్నటికైనా ఆదరిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. . అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని చూసి తనను గెలిపించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకరు ఆఫీసులను పంచుకుంటే మరొకరు ఇసుక రీచ్‌లను పంచుకుంటున్నారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలలో బీఆర్ఎస్ పార్టీకి మంచి పేరు ఉందని, ఆ గుర్తింపే వచ్చే ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా మళ్ళీ ప్రజలు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వందరోజుల్లో ఆరుగ్యారంటీలు అమలు చేస్తానని చెప్పి ఉచిత బస్సు తప్ప ఏ హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పూటకో మాట మార్చి విధివిధానాల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. రైతుల పక్షాన ఎలాంటి కోతలు, ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



బాల్కొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

తాత్కాలిక లబ్ధికోసం ఉన్నత స్థానాన్ని పార్టీని, నాయకత్వాన్ని వదిలి వెళ్ళడం సమంజసం కాదని పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువతను రెచ్చగొట్టిన నాయకులు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న పదవులు తీసుకొని నోరుమూసుకున్నారని ఎద్దేవ చేశారు. అంతకుముందు ఎంపీపీలు, జడ్పీటీసీలను, ఎంపీటీసీసభ్యులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్‌సభ్యులు, ఎం పీటీసీసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బద్దం ప్రవీన్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, నాగంపేట్ శేఖర్ పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు మద్దతుగా వర్సిటీ బంద్

డిచ్‌పల్లి, జూలై 4: నీట్ విద్యార్థులకు మద్దతుగా తెలంగాణ యూనివర్సిటీలో పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేశారు. ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుతంగా బంద్ నిర్వహిస్తే వర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోకి పోలీసులు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను ఈడ్చుకుంటూ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ అన్నారు. పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని లేనిచో ప్రభుత్వానికి అడ్డు తలుగుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క.గణేశ్, ఎన్ఎస్‌యూ వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలం, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అక్షయ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ ఉపాధ్య క్షుడు దినేశ్, రాజేందర్, చిత్రు, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, నిరసనగా తెలంగాణ వర్సిటీలో శాంతి యుతంగా ఆం దోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులపై పోలీసులు ఈడ్చుకెళ్లి అరె స్ట్ చేయడం అప్రజాస్వామ్యకరమని పీడీఎస్‌య నాయకులు శివకుమార్, రాజేందర్‌లు అన్నారు. జరిగిన ఘటనపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు విద్యార్థి నాయకులకు క్షమాపణలు చెప్పాలన్నారు.



టీయూలో ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



మోర్తాడ్ ప్రత్యేక అధికారిని సన్మానిస్తున్న ఎంపీడీవో సిబ్బంది



కోటగిరిలో బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎల్‌పీవో సాయిబాబా

కోటగిరి, జూలై4: మండల ప్రత్యేక అధికారిగా గురువారం బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగియడంతో జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతీ, ఏపీవో గంగారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి మల్లికార్జున్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన తన బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ను శాలువాతో కార్యాలయ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

రుద్రూరు : మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో మండల పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా రుద్రూరు మండల పరిషత్‌కు డీఎస్‌సీడీవో శశికళను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు.

మోర్తాడ్ : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వైద్యాధికారి మధుసూదన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం మండల పరిషత్ కార్యాలయానికి రాగానే ఎంపీడీవో తిరుమల, ఉద్యోగులు స్వాగతం పలికారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌ను ఎంపీడీవో తిరుమల, సూపరిండెంట్ లింగయ్య, ఉద్యోగులు శ్రీనివాస్, శ్రీధర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : మండల ప్రత్యేకాధికారిగా జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ యోహన్ బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచిం చారు. మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, జడ్పీటీసీ సభ్యులు పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకపాలన ప్రభుత్వం ఏర్పాటు చేసిం దన్నారు.

ముప్కాల్: స్థానిక సంస్థల పదవీకాలం ముగియడంతో మండల కేంద్రాలలో స్పెషల్‌ఆఫీసర్లు గురువారం నూతన పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాల్కొండ స్పెషల్ ఆఫీసర్‌గా డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ముప్కాల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రసూల్‌బీని శాలువతో సత్కరించారు.

విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేల్పూర్, జూలై4 : ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య అధికారి కటకం శంకర్ సూచించారు. వేల్పూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వాతావరణంలో అకస్మాత్తుగా కలిగే మార్పులు, వర్షాలు కురువడం, నీటి నిల్వ కారణాల వల్ల అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఇళ్లు, ఇంటి పరసరాలలో నీటి నిల్వ ఉండడం వల్ల దోమలార్వ అభివృద్ధి చెందుతుందని, నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని ఆరోగ్య పర్య వేక్షకురాలు నాగమణి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కందకుర్తి ప్రాథమిక పాఠశాలలో మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాటించవల్సిన నిబంధనలపై వారికి జిల్లా ఆరోగ్య విద్యాబోధకుడు వేణుగోపాల్ రావు అవగాహన కల్పించారు. నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, కలరా, డయేరియా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలు, చికిత్స మొదలగు అంశాలపై అవగాహన కలిగి ఉండి వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా హ్యాండ్ వాషింగ్, తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, మొదలగు వ్యాధులు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, జానకి, రాణి, సరస్వతి, జమున, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి విద్యాసాగర్ సూచించారు. గురువారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో మహాత్మజ్యోతిరా వుఫూలే పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని, విద్యార్థులు భోజనం చేసే సమయంలో ప్లేట్లను, చేతులను శుభ్రం చేసుకొని భోజనం చేయాలన్నారు. అనంతరం పాఠశాల 22 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించి మందులను పంపిణీ చేశారు.

నేటి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ



మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు

నవీపేట, జూలై4 : పింఛన్ల పెంపు కోసం శుక్రవారం చేసే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ కోరారు. గురువారం నవీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు 2వేల నుంచి 4 వేల రూపాయలు, దివ్యాంగులకు 3 వేల నుంచి 6 వేల రూపాయల వరకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ రకాల పింఛన్లను పెంచి లబ్దిదారులకు అందించిందని ఆమె గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా పింఛన్‌ల పెంపు అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పింఛన్లను పెంచకపోతే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మానికోళ్ల గంగాధర్, పంతులు, లక్ష్మణ్, ప్రకాష్, రాజు, గంగాధర్, గోదావరి, సాయమ్మ పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 4 : శాసనసభ స్పీకర్ గడ్డంప్రసాద్‌ను గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, అధికార పార్టీకి మాత్రమే ప్రొటోకాల్ పాటిస్తున్నారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకల్ ఖచ్చితంగా పాటించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా తిరుమల తిరుపతిలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఇచ్చే ఎమ్మెల్యే సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్పీకర్‌ను కోరారు.

పాఠశాలల్లో జరిగే పనులను పూర్తిచేయాలి

● మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్



ఉర్దూ మీడియం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారి

నవీపేట,జులై4: మండలంలోని వివిధ గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పేరుతో జరుగుతున్న పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలో తాగునీటితో పాటు మరుగుదొడ్ల మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని నిర్వాహకులను కోరారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడుదాం



కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జులై4: దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడుదామని ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందార్లకు వారి ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజాస్వామిక హక్కులకై పేద ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకై పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈర్షద్, బాబు మియా, మోహన్, డి.పోశెట్టి, శ్రీను, గంగారాం, సాయిలు, శంకర్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జులై4: ఆలూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో పదవీకాలం ముగిసిన వైస్‌ఎంపీపీ బోజకళా చిన్నారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీమల్లేష్‌లను గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లు ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించారని గ్రామస్థులు కొనియాడారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కల్లెం మోహన్, ఉపసర్పంచ్ దుమ్మజి శ్రీనివాస్, మనోహర్, శివ, దుబ్బాక సంతోష్, పోశెట్టి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఐకెపీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

డిచ్‌పల్లి,జులై 4: గత నెల 20న బర్ధీపూర్ శివారులో గల మహేంద్ర షోరుంలో కారు దొంగతనం చేసిన ముగ్గురు దొంగలను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్‌లు తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో అబ్దుల్ సల్మాన్ ఖాన్ (ఫతేనగర్), మహమ్మద్ (అర్మూర్), వాహీద్ పాషా(సిద్దిపేట), లకు చెందిన వారిగా గుర్తించామని, పదిరోజుల్లోనే నిందితులను ఐడీ పార్టీ, స్థానిక పోలీసులు ప్రత్యేక చొరవ చూపి పట్టుకున్నరని సీఐ, ఎస్సై తెలిపారు. సీపీ కల్మేశ్వర్ నిందితులను పట్టుకున్న పోలీసులను అభినందించారని సీఐ, ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఐడీ పార్టీ సర్దార్, సందీప్, సతీశ్, రాము, సుధాకర్, పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయం వద్ద బోరు వేయించిన ఎంపీటీసీ

ఎడపల్లి, జులై 04: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గల పెద్దమ్మ ఆలయం వద్ద ఆ గ్రామ ఎంపీటీసీ వెంకన్నగారి రాంరెడ్డి గురువారం బోరు బావిని తవ్వించారు. గ్రామ శివారులోని ఆలయం వద్దకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులున్నందున కులసంఘ పెద్దల కోరిక మేరకు బోరు వేయించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు కుర్నాపల్లి ముదిరాజ్ కులసంఘ పెద్దలు, సభ్యులు తదితరులు ఉన్నారు.

'అక్రమ నిర్మాణాలు ఆపి న్యాయం చేయాలి'

పెర్కిట్, జూలై4: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో గల సర్వే నెంబర్ 183 భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇది వరకే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశామని సురకుంట నవీన్ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రాజును వివరణ కోరగా ఈ సర్వేనెంబర్‌లో నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదని వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ నాయకులు ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహరెడ్డి మాట్లాడుతూ అధికారులు అండదండలతోనే పట్టణంలోని పలు అక్రమ కట్టడాలు చేపడుతున్నారని అన్నారు.

బాల్కొండలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ముప్కాల్, జూలై4: బాల్కొండ మండల కేంద్రంలోని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ ఆధ్వర్యంలో గురువారం జానతాదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో ఆయన మొక్కలు నాటారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో అమ్మపేరు మీద ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, ప్రధాన కార్యదర్శి మీసాల చందు, మండల కార్యదర్శులు భూసం సత్యనారాయణ, సాయికిరణ్, ముత్యంరెడ్డి, రాంకిషన్, మగ్గిడి లింగన్న, నర్సయ్య, బీజేపీ సీనియర్ నాయకులు గంగసాయన్న, రమేష్, చంటి, నరేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం

డిచ్‌పల్లి,జులై 4: మండలంలోని సుద్దులం గ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లో గత పదేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన శ్రీదేవి, రమేశ్, సుమలతలను గ్రామంలో విద్యార్థులు, పెద్దలు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాల అభ్యున్నతికి 5వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్, కాం గ్రెస్ ప్రతినిధులు సురేందర్ రెడ్డి, రామ్‌రెడ్డి, వినయ్, విఘ్నేశ్, మాజీచైర్మన్ రాజగంగు, ప్రధానోపాధ్యాయులు గంగారం, ఉపాధ్యాయులు రాజేశ్వర్, నీలబాయి. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి

కామారెడ్డి టౌన్, జూలై 4: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చైర్‌పర్సన్ ఇందుప్రియ తెలిపారు. గురువారం పట్టణ పోలీసు స్టేషన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు గల రోడ్డును పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్ సుజాతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పట్టణ పోలీసుస్టేషన్ ముందు ఉన్న యూటర్న్‌ను మూసివేయడంతో వాహనదారులు ప్రభుత్వ ఆసుపత్రి ముందు నుంచి యూటర్న్‌ను తీసుకుంటున్నారని అక్కడ సైతం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండడంతో ప్రత్యామ్నాయ యూటర్న్ కోసం పరిశీలించినట్లు తెలిపారు. గతంలో ఉన్న యూటర్న్ వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు తెలుపడంతో ప్రభుత్వ ఆసుపత్రి, పోలీసుస్టేషన్ మధ్యలో ఉన్న ప్రాంతంలో యూటర్న్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా స్పీడ్ బ్రేకర్‌లు, బార్‌గేట్లు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు కన్నయ్య, కృష్ణమూర్తి, చాట్ల వంశీ, నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


యూటర్న్ ఏర్పాటును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


బీర్కూర్ కళాశాలలో మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్ సలాం

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : షేక్ సలాం

బీర్కూర్, జూలై 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలు అందజేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రణాళిక ప్రకారం పాఠాలు బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన విద్యాసంస్థల బంద్

కామారెడ్డిటౌన్, జూలై 04 : నీట్ పరీక్షను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖమంత్రిని సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని పాఠశాలలు ముందుగానే బంద్ ప్రకటనతో మూసివేయగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతుండడంతో విద్యార్థి సంఘ నాయకులు వాటిని బంద్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అత్యున్నతమైన పరీక్షగా నీట్‌పరీక్షలు నిర్వహిస్తారని అలాంటి పరీక్ష పేపర్లను ఎన్‌టీఏ నిర్లక్ష్యం వల్ల, డబ్బులకు ఆశపడి అమ్ముకున్నారని అన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపితే లాఠీచార్జ్ చేస్తు అరెస్ట్‌చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, పీడీఎస్‌యూ రాష్ట్రకోశాధికారి సురేష్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, బీడీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మణికంఠ, నాయకులు భరత్, సురేష్‌కార్తీక్, రాహుల్ పాల్గొన్నారు.

మద్నూర్: ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ ఎంట్రెన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మద్నూర్ మండలంలోని పాఠశాలలను ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు బాలు యాదవ్ మూయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలను తొలగించాలని కోరారు. బీహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్న పత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు.


మద్నూర్‌లో పాఠశాలలు బహిష్కరించిన విద్యార్థులు

గాంధారి: మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై ఎన్‌ఎస్‌యూఐ నిరసన తెలుపుతూ బంద్ ప్రకటించింది. దీంతో పలు పాఠశాలలు బంద్ చేయకపోవడంతో విద్యార్థి సంఘ నాయకులు ఆయా పాఠశాలలకు వెళ్లి బంద్ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సర్దార్‌నాయక్, మండల అధ్యక్షుడు రహమత్, ఉపాధ్యక్షుడు మోహన్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మోజీరాం, వినయ్‌కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: నీట్ పరీక్ష పత్రాల లీకేజీని నిరసిస్తు బీబీపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో నీట్ పేపర్ లీకై దేశంలోని విద్యార్థులందరి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టిన కేంద్రంలోని బీజేపీ అలసత్వానికి నిదర్శమని అన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, స్వామి, రాజు, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో
భిక్కనూరు విద్యార్థుల ప్రతిభ

భిక్కనూరు, జూలై 4: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పాఠశాల పీడీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒక గోల్డ్, రెండు సిల్వర్, రెండు బ్రౌంజ్ మెడల్స్ సాధించారని, 300 మీటర్ల పరుగు పందెంలో మధుప్రియ రాష్ట్రస్థాయికి ఎంపికైందని వివరించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

భిక్కనూరు ప్రత్యేక అధికారిణిగా రజిత

భిక్కనూరు, జూలై 4: మండల ప్రత్యేక అధికారిణిగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణిగా రజిత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, అధికారులు తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది మండల ప్రత్యేక అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన అధికారిణికి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల పనులను వేగవంతం చేయాలి

భిక్కనూరు, జూలై 4: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారిణి రజిత సూచించారు. గురువారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, నర్సరీని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నాణ్యతతో చేపట్టాలని, గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మద్నూర్, జూలై 4 : ఉమ్మడి మద్నూర్ మండలంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పలువురు వ్యవసాయ భూములను ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి నాలా పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని మద్నూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్, సర్వేయర్ గోపాల్‌లు గురువారం మండలంలోని సలాబత్‌పూర్‌ర్, మండల కేంద్రంలోని భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూకు సంబంధించిన ఇతర శాఖలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిశీలించిన భూముల వివరాలను అధికారులకు పంపించనున్నట్లు వెల్లడించారు.

కోటను సందర్శించిన రామాయంపేట మహిళలు

దోమకొండ, జూలై 4: మండల కేంద్రంలోని గడి కోటను గురువారం మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన కిట్టి ఫ్రెండ్స్ మహిళలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పలువురు పరిశీలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వారు కోటలోనే సంతోషంగా గడిపారు. కోటలోని శివాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అద్దాలమేడ, రాజభవనం, సొరంగ మార్గం, 100 సంవత్సరాల చరిత్ర కలిగిన గడియారం, చుట్టూ కందకను పరిశీలించి 400 చరిత్ర గల శివాలయం, కోట యొక్క వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటలోని భవనాలు, ప్రముఖ్యత చాలా బాగుందన్నారు.

దోమకొండ మండల ప్రత్యేకాధికారిగా భాగ్యలక్ష్మీ

దోమకొండ, జూలై 4: మండల ప్రత్యేకాధికారిగా భాగ్యలక్ష్మీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా పని చేస్తున్నారు. ఎంపీడీవో రమేష్, ఎంపీవో తిరుపతిరెడ్డిలు ఆమెకు స్వాగతం పలికారు. మండలానికి సంబంధించి పలు పనులు, వివరాలను ఆమెకు వివరించారు.


మద్నూర్‌లో పంటలను పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మీ

క్షేత్రస్థాయిలో వానాకాలం పంటల పరిశీలన

మద్నూర్, జూలై 4 : మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వానాకాలం పంటలను క్షేత్రస్థాయిలోకి వెళ్లి జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ పరిశీలించారు. మద్నూర్‌తో పాటు మండలంలోని అవల్గావ్ గ్రామాల్లో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. వానాకాలంలో ముఖ్యంగా వ్యవసాయ అధికారులు, విస్తీర్ణా అధికారులు, రైతులకు అందుబాటులో ఉండి పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. అలాగే సాగు చేస్తున్న పంటలను ఎప్పటికప్పుడు సర్వేచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ అధికారులకు రాసి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద ఏడీఏ లక్ష్మీ ప్రసన్న, మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు, ఏఈవోలు ప్రియాంక, బాజన్న, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాలను
ఉన్నతాధికారులకు అందజేస్తాం

● జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి

బీర్కూర్, జూలై 4 : రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు సేకరించి క్యాబినెట్ సహాయ కమిటీకి అందజేస్తామని కామారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా పథకం అమలు చేసేందు కోసం రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. గతంలో గుట్టలు, కొండలు, వెంచర్లు వ్యవసాయేతర బూములకు రైతు బంధు ఇచ్చారన్న ఆరోపణలు వచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు రఘు, ద్రోణవల్లి అశోక్, సందీప్, బస్వారాజ్, సహకార సంఘం ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఆవారి గంగారాం, ఆరీఫ్, శశి, పోగు నారాయణ, రఘు, గంగారాం, రాములు, నారాయణ, అశోకప్ప, క్లస్టర్ అధికారి కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి కమల, సీనియర్ ఏఈవో శ్రావణ్‌కుమార్, సీఈవో మల్లోడ్డి విఠల్, సహకార సంగం డైరెక్టర్లు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, జూలై 4: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షిని గురువారం జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపాదాస్ మున్షిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని, ఈ భేటీలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, రానున్న రోజులలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లాంటి విషయాల గురించి చర్చించడం జరిగిందని తెలిపారు.


దీపాదాస్ మున్షీతో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్

భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా

భిక్కనూరు, జూలై 4 : భిక్కనూరు ఎంపీపీ చాంబర్‌లో కాంగ్రెస్ నాయకుల ఫొటోలు పెట్టడం ఏమిటని, అసలు ఇది ఎంపీడీవో కార్యాలయమా లేక కాంగ్రెస్ కార్యాలయమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల బీజేపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల ఫొటోలు పెట్టినవారిపై, మండల సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల సర్వసభ్య సమావేశానికి ఏ హోదాలో షబ్బీర్‌అలీని ఆహ్వానించారని, ప్రొటోకాల్ పాటించడం తెలియదా అంటూ మండల ప్రత్యేక అధికారిణి రజిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో బీజేపీ నాయకులు వాగ్వాదం చేశారు. ఇక నుంచి అలాంటివి జరగవని, కార్యాలయంలో ఉన్న ఫొటోలను, ఫ్లెక్సీలను తొలగించడం జరిగిందని వారు హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

● బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు

కామారెడ్డి రూరల్, జూలై 4: కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కామారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు విశ్వనాథుల అనిత అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు మహలక్ష్మి పథకం కింద ఇస్తానన్న రూ.2,500 వెంటనే ఇవ్వాలని, కనీసం జనవరి నుంచి బకాయిలు కలిపి చెల్లించాలని 6 నెలల బకాయిలు 15వేలు వెంటనే చెల్లించాలని అన్నారు. నవవధువుకి ఇస్తానన్న తులం బంగారం గత డిసెంబర్ నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి నుంచి పెళ్లి చేసుకున్న ప్రతి యువతికి తులం బంగారం ఇవ్వాలని అన్నారు. 18 సంవత్సరాల నిండిన కాలేజీకి వెళ్లే ప్రతి ఆడపిల్లలకి ఇస్తానన్న స్కూటీలు వెంటనే ఇవ్వాలని అన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తా మని హెచ్చరించారు.

పెద్దకొడప్‌గల్ మండల ప్రత్యేక అధికారిగా కిషన్

పెద్ద కొడప్‌గల్, జూలై 4 : పెద్ద కొడప్‌గల్ మండల ప్రత్యేక అధికారిగా గురువారం కిషన్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న కిషన్‌ను ప్రభుత్వం మండల ప్రత్యేక అధికారిగా నియమించడంతో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతు మండల అభివృది కోసం తన వంతు కృషిచేస్తానని, మండలంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడంతో గ్రామ పంచాయతీ పరిధిలోగల నర్సరీని పరిశీలించారు. అంతకు ముందు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌కు మండల ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్‌తో పాటు అధికారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ విఠల్, ఈజీఎస్ ఏపీవో సుదర్శన్‌లు పాల్గొన్నారు.

జుక్కల్ మండలప్రత్యేక అధికారిగా అనిల్

జుక్కల్ మండల ప్రత్యేక అధికారిగా బొప్పాస్‌పల్లి సీడ్‌పాం ఏడీఏ అనిల్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌ను ఎంపీడీవో పలువురు అధికారులు సన్మానించారు.

బీజేపీ మాచారెడ్డి మండల కమిటీ ఏర్పాటు

మాచారెడ్డి, జూలై 4: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాలమేరకు మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు మండల అధ్యక్షుడు బుస సురేష్ తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులుగా కొడగండ్ల రాజశేఖర్, నర్సింలు, ఉపాధ్యక్షులుగా భరత్‌యాదవ్, క్రాంతికుమార్, పడిగేర మేష్, సాయిరాంగౌడ్, కిషన్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా ఓదేలు, బీజేవైయం అధ్యక్షుడిగా రాచర్ల కళ్యాణ్, మహిళ మోర్చా అధ్యక్షురాలిగా దుబ్బాక రజిత, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా రఘునాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా రామస్వామి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బాల్‌చంద్రంలను,మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా మహ్మద్‌షాదుల్, కోశాధికారిగా ప్రభాకర్, కార్యదర్శులుగా తిరుపతి,వినోద్, హరీష్‌గౌడ్, నవీన్, మహేష్, రమేష్,కార్యవర్గసభ్యులుగా దామోదర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రగౌడ్, అంజయ్యరాజాగౌడ్, చలపతి, లింగంలతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో నుంచి బంగారం చోరీ

బిచ్కుంద, జూలై 4: బిచ్కుంద బస్టాండ్‌లో బుధవారం ఓ మహిళ మెడలో నుంచి అరతులం బంగారం చోరీ చేసినట్లు బిచ్కుంద పోలీసులు తెలిపారు. జుక్కల్ మం డలం ఎడ్గి గ్రామానికి చెందిన సాయవ్వ బస్సు ఎక్కుతుండగా మెడలోంచి గుండ్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. గురువారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సెల్‌ఫోన్‌ను బాధితుడికి
అప్పగించిన ఎస్‌ఐ

రాజంపేట, జూలై 4: రాజంపేట మండలంలోని బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఏలేటి నాగరాజు అనే వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం ఎస్‌ఐ సంపత్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులక్రితం మొబైల్‌ఫోన్ పోయిందని బాధితుడు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా పోయిన సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పగించినట్లు తెలిపారు. ఎవరైన సెల్‌ఫోన్ పొగొట్టుకున్నట్లయితే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఇంట్లో చోరీ

గాంధారి, జూలై 4: గాంధారి మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనం సమీపంలో వడ్ల కమ్మరి గల్లిలో కవిత ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఉదయం కవిత తన ఇంటికి తాళం వేసి ఫంక్షన్ నిమిత్తం తన బంధువుల గ్రామం ముదెల్లికి వెళ్లింది. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో పాటు తలుపులు తెరిచి ఉండ డంతో పక్కింటి వారు కవితకు సమాచారం అందిం చారు. దీంతో ఆమె వచ్చి చూడగా ఇంట్లో ఉన్న 1.2 తులా ల బంగారం, 5 తులాల వెండి, నగదు పోయినట్లు గుర్తిం చింది. కవిత ఫిర్యాదు మేరకు ఇంటిని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తైబజార్ వేలం
రెండోసారి వాయిదా

నాగిరెడ్డిపేట, జూలై 4 : మండల కేంద్రంలోని గోపాల్ పేట్ గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం పాట గురు వారం రెండోసారి వాయిదా పడింది. ఈనెల ఒకటో తేదీన తైబజార్ వేలం పాట కోసం గ్రామ పంచాయతీలో ఏర్పాట్లు చేయగా, తైబజార్ వేలం పాటలో పాల్గొనేం దుకు కేవలం ఒక్క వ్యక్తి మాత్రమే డిపాజిట్ సొమ్ము చెల్లించడంతో అధికారులు తైబజార్ వేలం పాట నిర్వ హించకుండా వాయిదా వేశారు. తిరిగి గురువారం గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం పాట నిర్వహించగా, ఎల్లారెడ్డికి చెందిన భాస్కర్, నాగిరెడ్డిపేటకు చెందిన సాయి బాబాగౌడ్, గోపాల్‌పేట్‌కు చెందిన సాజీద్‌లు 50 వేల రూపాయల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనగా, ఎల్లారెడ్డికి చెందిన భాస్కర్ అందరి కంటే అధికంగా రెండు లక్షల 67 వేల రూపాయల వేలం పాట పాడారు. అయితే ప్రభుత్వ ఆదేశానుసారం తైబజార్ వేలం పాట కనీస ధర మూడు లక్షల 90 వేల 225 రూపాయలు ఉండటంతో ప్రభుత్వం నిర్ణయించిన ధర వేలం రాకపోవడంతో రెండోసారి వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి కిష్టయ్య ప్రకటించారు. తిరిగి ఈనెల 8వ తేదిన ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో తైబజార్ వేలం పాటను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

మద్నూర్, జూలై 4 : మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామానికి చెందిన ఔటి గంగామణి మూడు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేయగా చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మూడురోజులు మృత్యువుతో పోరాడి బుధవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా
ప్రధాన కార్యదర్శిగా అరుణ

ఎల్లారెడ్డి, జూలై 4 : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా చిట్మెళ్ళ అరుణను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి చేతుల మీదుగా అందించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అరుణను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు ఘనం గా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిబాబా, సీనియర్ నాయకులు లక్ష్మణ్, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు పార్టీ కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.

ముగిసిన మండల జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం

మద్నూర్, జూలై 4: మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీల ఐదేళ్ల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా మద్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ అనిత కథలయ్య, ఎంపీపీ లక్ష్మీబాయి, ఎంపీటీసీ సభ్యులను గురువారం నాయకులు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో రాణి, ఎంపీవో లక్ష్మీ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


జడ్పీటీసీ, ఎంపీపీ,ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

ఇక ప్రత్యేక పాలన

మండల, జిల్లాపరిషత్ సభ్యుల పదవీ కాలం ముగియడంతో పరిషత్ పాలన వ్యవస్థ అంతా అధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. ఐదేళ్ల పాటు సేవలు అందించిన సభ్యులంతా ఇక మాజీ సభ్యులుగా మిగిలిపోతున్నారు. పాలన వ్యవహారాల్లో ఇకపై వారి జోక్యం ఉండబోదు. మండల, జిల్లా పరిషత్‌కు వచ్చే నిధులు ఖర్చు ఇతర పాలనాపరమైన అధికారులే పర్యవేక్షిస్తారు. ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించిన ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో మద్నూర్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి
శాంతి - ఓసీ
దర్శన్ - కల్కి
ప్రియా 70 - కల్కి

బాన్సువాడ
మహేశ్వరి - కల్కి
వెంకటేశ్వర - మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

